ఘనంగా ఊర పండుగ



ఖిల్లా ముఖద్వారం వద్ద గ్రామదేవతల గద్దె వద్ద భక్తుల సందడి





నగరంలో ఆదివారం ఊర పండుగ ఘనంగా జరిగింది. నగర ప్రజలు భక్తి శ్రద్ధలతో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించారు. ఉదయం 9 గంటలకు ఖిల్లా వద్ద గ్రామదేవతల విగ్రహాల ఊరేగింపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి తొట్ల కింది నుంచి వెళ్లడానికి భక్తులు పోటీపడ్డారు. గ్రామదేవతలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. – నిజామాబాద్‌అర్బన్



కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు



సర్వ సమాజ్ మాజీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ అధికార ప్రతినిధి స్వామి యాదవ్, బీజేపీ నాయకులు



పోతరాజులతో మాజీ మేయర్ భర్త శ్రీశైలం తదితరులు



పోతరాజుల విన్యాసాలు

పండ్లు, నీళ్ల పంపిణీ



ఖలీల్‌వాడి: నగరంలో ఊరపండగా సందర్భంగా పండ్లు, నీళ్లను నకాశ యువజన సంఘం సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. నగరంలోని కోటగల్లీలోని ఆర్యసమాజ్ వద్ద ఊరపండగకు వచ్చే నగర ప్రజలకు మంచి నీటిని, అరటి పండ్లను ఇచ్చారు. ప్రతి ఊర పండగ, వినాయకచవితి, దుర్గామాత ఉత్సవాలకు నకాశ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూల కొండ శ్రీకాంత్, పూలకొండ నవీన్, సచిన్, గోపి, లింబాగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తొట్లెల కింద నుంచి వెళ్లడానికి క్యూ కట్టిన భక్తులు

క్లుప్తంగా

ఎలక్ట్రికల్ రైల్వేగేటు ప్రారంభం



డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని మాన్యువల్ రైల్వేగేటును ఎలక్ట్రికల్ రైల్వేగేటుగా ఆధునీకరించారు. కొత్తగా ఏర్పాటు చేసిన రైల్వే గేటును ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు రైల్వే అధికారులు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు ఎలక్ట్రికల్ రైల్వే గేటుకు ట్రయల్స్ నిర్వహించి సక్రమంగా పని చేస్తుందా లేదా అని పరీక్షించారు. అనంతరం సాయంత్రం గేటును ప్రారంభించారు. ఇకపై చేతితో తిప్పుతూ గేటు వేయాల్సిన అవసరం లేకుండా బటన్ సహాయంతో గేటు మూస్తారని సిబ్బంది తెలిపారు.

ఈదురు గాలులకు నేలకూలిన చెట్టు



డిచ్‌పల్లి: శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన గల చెట్టు నేలకూలింది. టీఎస్ఎస్‌పీ ఏడవ బెటాయలిన్ నుంచి ఖిల్లా గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న చెట్టు సగం రోడ్డుపై పడిపోవడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తులు ఆదివారం చెట్టును రోడ్డు నుంచి పక్కకు తొలగించారు.

ఆర్థిక సాయం అందజేత



నిజామాబాద్‌అర్బన్: దళిత కళ్యాణ్ సమితి నాందేవ్‌వాడ అధ్యక్షులు కల్పనాబాయి కుమరుడికి సమితి సభ్యులు ఆదివారం ఆర్థిక సహాయం చేశారు. ఇటీవల కల్పనాబాయి కుమరుడు అఖిల్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసినట్లు సమితి అధ్యక్షుడు దౌలత్ తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయకులు రాంచందర్, గైక్వాడ్, మనోహర్ రావ్, నవీన్, రామారావ్, మారుతి, శివాజీ, స్నేహలత, ప్రేమ్‌నాథ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిద్దాం

డిచ్‌పల్లి: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అమరుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిద్దామని మాస్‌లైన్ జిల్లా నాయకుడు సాయాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం డిచ్‌పల్లిలో రాయలచంద్రశేఖర్ సంతాపసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ.. రాయల చంద్రశేఖర్ ఐదు దశాబ్దాల విప్లవ జీవితంలో ఎన్నో ఆటు పోట్ల మధ్య సిద్ధాంత వైరుధ్యాలతో రాటుదేలిన మనిషి అన్నారు. ఎన్నో నిర్బంధాలను, బెదిరింపులనూ, ఎన్‌కౌంటర్లనూ ధిక్కరించి ఉద్యమ జెండాను భుజాలపై మోసిన విప్లవోద్యమ నాయకుడని పేర్కొన్నారు. ఆయన విప్లవ జీవితం ఎంతో గొప్పదని, ఆచరణీయమైనదని తెలిపారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చూపిన దారిలో మనం నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారమవుతాయన్నారు. మురళి, రాజేందర్, మోహన్, లలిత, సాయిబాబా, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వివాహ ఆదివారం వేడుకలు

డిచ్‌పల్లి: బర్ధిపూర్ గ్రామంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో రెవరెండ్ జి.దినకర్ ఆధ్వర్యంలో వివాహ ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక సందేశం వినిపిస్తూ.. వివాహ వ్యవస్థ అనేది దేవుని చేత నిర్ణయించబడిందన్నారు. భార్యాభర్తలు జీవిత కాలమంతా ప్రేమతో జీవించాలన్నారు. విడాకులు దేవుని చిత్తం కాదని బోధించారు. అనంతరం పది మంది జంటలను ప్రత్యేకంగా అభినందించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, పిల్లలు, పలువురు దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా తీజ్ ఉత్సవాలు



ఇందల్వాయి: మండలంలోని ఎత్తుతండా, మేఘ్యానాయక్ తండా, ఇందల్వాయి తండాల్లో గిరిజనులు తీజ్ ఉత్సవాలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. వారం రోజులుగా పవిత్రంగా పూజించిన తీజ్ బుట్టలను భోగ్ బండార్ పూజలు నిర్వహించిన అనంతరం బంజార నృత్యాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో గిరిజన పెద్దలు, యువతి యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గండి మైసమ్మ బోనాల పండుగ



ఊరేగింపు నిర్వహిస్తున్న మంచిప్ప గ్రామస్తులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప గ్రామంలో గండి మైసమ్మ బోనాల పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంలో ప్రతియేటా గండి మైసమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు గ్రామస్తులు పెద్దసంఖ్యలో బోనాలతో శివసత్తుల ఆటపాటలు, పోతరాజుల విన్యాసాలతో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి, పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ గండి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వీడీసీ ప్రతినిధులు ఆయనను సన్మానించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు గోవూరు నరేష్‌రెడ్డి, కోశాధికారి దేవిసింగ్, సాయిరెడ్డి, సాయిరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుంది

– బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ జోష్యం చెప్పారు. ఆదివారం రూరల్ మండల పరిధిలోని ముబారక్ నగర్ 18 డివిజన్ పరిధిలో ఉన్న ముదిరాజ్ సంఘంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనంత కుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దినేష్ కులాచారి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు లోబడి కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేసి జిల్లాలోని అన్ని డివిజన్లలో బీజేపీ జెండాను ఎగరవేయాలని అన్నారు. అదేవిధంగా పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ కన్వీనర్ పద్మా రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర సభ్యులు సందీప్, సొసైటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్ల నైవేద్యం



పోలేరమ్మకు నైవేద్యాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

డిచ్‌పల్లి: ధర్మారం(బి) గ్రామంలో ఆదివారం పోలేరమ్మకు భక్తులు పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. ప్రతి ఏటా ఆషాడమాసం చివరి ఆదివారం పోలేరమ్మ బోనాలు నిర్వహిస్తారు. పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం మొదలుకొని రెండు గురువారాలు మూడు ఆదివారాలు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. మొదటి నాలుగు వారాలు పెరుగు సద్ది, పొంగలి నైవేద్యంగా సమర్పిస్తారు. చివరి ఆదివారం ఉదయం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించి అలంకరిస్తారు. తర్వాత బోనాలు, మూగజీవాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటారు. పెరుగు సద్ది, పొంగలి బోనాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వర్షాలు బాగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకుంటారు. కుటుంబసభ్యులు, బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు ఆరగిస్తారు. గ్రామపెద్దలు రావుల బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వన భోజనాల సందడి



సిరికొండలో వన భోజనాలు చేస్తున్న గ్రామస్తులు

సిరికొండ: మండల కేంద్రంతో పాటు మైలారం, కొండూర్, పెద్దవాల్గోట్, చిన్నవాల్గోట్, హుస్సేన్ నగర్, తాళ్లరామడుగు తదితర గ్రామాల్లో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామ దేవతలకు పూజలు చేశారు. కుటుంబ సభ్యులందరూ కలిసి వనాల్లో కెళ్లి భోజనాలు చేశారు. పిల్లలు నృత్యాలు చేస్తూ ఆటలాడుతు సందడి చేశారు.

రూరల్ పరిధిలో..

నిజామాబాద్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా బంధువులతో కలిసి వన భోజనాలు చేశారు.

అసైన్డ్ భూములకు రుణాలు మంజూరు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ భూమయ్య



మాట్లాడుతున్న కంజర్ భూమయ్య. పాల్గొన్న ఇతర నాయకులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రుణమాఫీ అయిన అసైన్డ్ భూముల రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తాడెం గ్రామంలోగల దొడ్డి కొమురయ్య హాల్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కంజర్ భూమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను రుణ విముక్తి చేయడానికి మొదటి విడతలో రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని అభినందిస్తున్నామన్నారు. అలాగే రూ.రెండు లక్షల వరకు రుణాన్ని ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములను గత ప్రభుత్వం ధరణిలో చూపకుండా ఆ భూములను కాజేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. ఆ భూములకు వెంటనే పట్టాలివ్వాలని, రుణమాఫీ అయిన వారికి సొసైటీల్లో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

రైతు భరోసా ఏదీ..?

రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని, పెట్టుబడి కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గంగారాం, సాయిలు, చిన్నారెడ్డి, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,000	వెండి (కిలో)	87,000
22 క్యారెట్స్	66,415		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	30	50	గాజరుగడ్డ	35	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	40	60
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	25	50
కాకరకాయ	35	50	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	60	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	100	130	చిక్కుడుకాయ	50	75
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పిషియన్)

స్క్రీన్-1	రాయన్ (తెలుగు) - 10.45 1.35 4.30 7.25 10.20
స్క్రీన్-2	కల్కి 2898 2డీ (తెలుగు) - 4.15 10.20 డెడ్‌పూల్-3డీ(తెలుగు) - 1.40, 7.30
స్క్రీన్-3	డెడ్‌పూల్ - 3డీ (తెలుగు) - 10.40 10.40, డెడ్‌పూల్ - 3డీ (ఇంగ్లీష్) - 4.45 కల్కి-2898 2డీ(తెలుగు) -1.20 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డెడ్‌పూల్-3డీ(తెలుగు)-11.15,1.15 డెడ్‌పూల్-3డీ(ఇంగ్లీష్)-4.15,7.15, 10.15
స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ(తెలుగు)- 11.20 6.15 రాయన్(తెలుగు)- 3.05 10.00
స్క్రీన్-3	బాడ్ న్యూజ్ (హిందీ)-10.00,4.15, 10.30 పురుషోత్తముడు(తెలుగు)- 1.05,7.20
స్క్రీన్-4	రామ్ ఎన్ఆర్ఐ(తెలుగు)-10.10 గల్లీ గ్యాంగ్‌స్టార్స్(తెలుగు)- 1.00 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-4.20 రాయన్(తెలుగు)- 7.10 పురుషోత్తముడు(తెలుగు)-10.20
దేవి	రాయన్ (తెలుగు)
నటరాజ్	డెడ్‌పూల్ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య విస్తరణాధికారి శంకర్
- గురుకుల విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి శంకర్

డిచ్‌పల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి వై.శంకర్ సూచించారు. ఆదివారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల వల్ల కలిగే మలేరియా, చికున్ గున్యా, డెంగీ, ఫైలేరియా లాంటి వ్యాధులు రాకుండా దోమలను అరికట్టాలని ప్రిన్సిపాల్ నళినికి సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. వంట చేసే పరిసర ప్రాంతాలు, విద్యార్థులు పడుకునే డార్మెట్రీలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థినులు ఎవరైనా జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నట్లయితే ఆరోగ్య సిబ్బందికి వెంటనే తెలియజేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాలతో డాక్టర్ అరుణ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించి విద్యార్థులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మల్లేహ సుల్తానా, వెంకట్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరికి ఉండాలి'



ఖలీల్‌వాడి: సేవ చేయాలనే తపన ప్రతి ఒక్క వాసవి క్లబ్ సభ్యునికి ఉండాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల వీరేశం అన్నారు. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రెండో కేబినెట్ మీటింగ్ క్లబ్ జిల్లా గవర్నర్ గాదె సుదర్శన్ గుప్తా అధ్యక్షతన నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్ నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరుకుల వీరేశం మాట్లాడుతూ.. జిల్లాలో 30 క్లబ్‌ల ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు. వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలలో ముందుండాలని పాత క్లబ్‌లను సరి చేసుకుని కొత్త క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. గాదె సుదర్శన్ గుప్తా మాట్లాడుతూ.. సేవా భావం లేని మనిషి జీవితం జీవితమే కాదని తెలుసుకోవాలని అన్నారు. సభ్యులందరూ కలిసిమెలిసి వాసవి క్లబ్ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గుడిపల్లి రమేష్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్టిపుల్ విశ్వనాథం శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు మూడ నాగభూషణం, అదనపు ట్రెజరర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.